# నోట్ల కట్టలు కాంగ్రెస్‌వే..

- ఎన్నికల్లో డబ్బునే నమ్ముకున్న కాంగ్రెస్
- హస్తం నాయకుల వద్ద లక్షల్లో స్వాధీనం
- రేవంత్ ప్రధాన అనుచరుడిపై కేసుతో తేటతెల్లం
- కాంగ్రెస్ తీరుపై మండిపడుతున్న సామాన్య జనం

నిజామాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి పట్టణంలో మంగళవారం గూడెం శ్రీనివాస్ రెడ్డి వద్ద లభ్యమైన మొత్తం డబ్బు అక్షరాల రూ. 56 లక్షల 84 వేలుగా ఎన్నికల అధికారులు, ఆదాయ పన్ను శాఖ లెక్క తేల్చారు. 500 నోట్లతో కూడిన 114 కట్టలను స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు వెల్లడించారు. నవంబర్ 29న జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు కామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో గూడెం శ్రీనివాస్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డబ్బు స్వాధీనం ప్రక్రియలో తనిఖీలు నిర్వహించిన వారిలో ఆదాయ పన్ను శాఖ అధికారి అభిషేక్ శుక్లా సైతం ఉన్నారు. లభ్యమైన మొత్తం డబ్బుకు సంబంధించిన వాటికి ఆధారాలను సమర్పించడంలో సదరు వ్యక్తి విఫలమయ్యారు. ఇంత పెద్ద మొత్తంలో నోట్ల కట్టలను రియల్‌ఎస్టేట్ కంపెనీలో దాచడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించగా.. తలా తోక లేని సమాధానాలు ఇచ్చినట్లుగా తెలిసింది. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకే డబ్బులు తీసుకువచ్చినట్లుగా అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో నోట్ల కట్టలు ఏ విధంగా కామారెడ్డికి చేరుకున్నాయనే కోణంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు వివరాలు రాబడుతున్నారు. ఎన్నికల్లో ప్రజల మద్దతును కోరాల్సిన కాంగ్రెస్ పార్టీ.. దొడ్డిదారిలో డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు.

**ఆది నుంచి అడ్డదారే...**

కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నట్లుగా ప్రకటించడంతో ఆ పార్టీకి చెందిన షబ్బీర్ అలీ కంగుతిన్నారు. అప్పటివరకు తొడలు కొట్టిన కీలక నేతనే ఓటమిని అంగీకరించి పలాయనం చిత్తగించారు. పరువును నిలబెట్టుకునే క్రమంలో షబ్బీర్ స్థానంలో అభ్యర్థిత్వం ఖరారు చేసుకున్న పీసీసీ చీఫ్.. ఇక్కడి నుంచి పోటీకి దిగారు. ప్రజల మద్దతు ఇసుమంతైనా లేనటువంటి కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులు దాపురించడంతో కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు రేవంత్ దొడ్డిదారిని వెతుక్కున్నాడు. ఇందులో భాగంగానే కొడంగల్ బ్యాచ్‌ను రంగంలోకి దించి బీఆర్ఎస్ లీడర్లను కొనడానికి ప్రయత్నించారు. ఇలా కొంతమందిని ఎర వేసి, కండువా మార్పినప్పటికీ క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీ చెక్కు చెదరలేదు. గులాబీ సైనికులు మాత్రం కేసీఆర్ కోసం విశేషంగా కృషి చేయడంతో కేటీఆర్ కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సైతం సక్సెస్ అయ్యింది. ఆ తర్వాత కాంగ్రెస్ నిర్వహించిన బీసీ డిక్లరేషన్, రేవంత్ రెడ్డి రోడ్ షోలకు అంతగా స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి పరిస్థితులు మింగుడు పడలేదు. దీంతో ఎలాగైనా ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టాలని కుట్రలకు దిగి, ఇష్టానుసారంగా వ్యవహరించడానికి హస్తం పార్టీ స్కెచ్ వేసింది. ఇందులో భాగంగానే డబ్బు సంచులను డంప్ చేసి ప్రలోభాల పర్వానికి తెరలేపింది.

**ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న కాంగ్రెస్...**

కామారెడ్డి నియోజకవర్గంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వర్గీయులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకే తిలోదాకలిస్తూ ఈసీ వ్యవస్థకే సవాల్ విసురుతున్నారు. నాన్ లోకల్ వ్యక్తులు ప్రచారం ముగిసిన తర్వాత కామారెడ్డిలో ఉండకూడదని రూల్ ఉన్నప్పటికీ లెక్క చేయకుండా కామారెడ్డిలోనే రేవంత్ మనుషులు తిష్ట వేసుకొని ఉన్నారు. దొడ్డి దారుల్లో గుర్తింపు కార్డులను దక్కించుకున్న వ్యక్తులు.. తలోదారిలో తల దాచుకుని ప్రజలను డబ్బుతో కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్‌పై పోటీకి దిగిన రేవంత్‌రెడ్డి ప్రజల మనసులను కొల్లగొట్టి గెలవాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా ఓటర్లను డబ్బులతో కొనుగోలు చేస్తు విస్తృత చేష్టలకు తెరలేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రేవంత్‌రెడ్డి అనుచరుడిగా పేరొందిన గూడెం శ్రీనివాస్‌రెడ్డి వద్ద నోట్ల కట్టలు బయటపడ్డాయి. కామారెడ్డి పట్టణంలోని జీవదాన్ స్కూల్ వద్ద ఉన్న రియల్‌ఎస్టేట్ ఆఫీసు అడ్డాగా చేసుకొని, ఈ అక్రమ తంతును నడుపుతుండగా పలువురు గుర్తించారు. వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా దాడులు నిర్వహించారు. ఇందులో నోట్ల కట్టలు బయట పడడంతో అవాక్కైన ఎన్నికల అధికారులు.. వెంటనే ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇచ్చారు. లెక్కా పత్రాలను తేల్చిన తర్వాత ఈ మొత్తం అక్రమంగానే తీసుకువచ్చిన సొమ్ము కింద భావించి బుధవారం కేసు నమోదు చేయడంతో వీరి వ్యవహారం తేటతెల్లమైంది.

## కంట్రోల్ రూమ్ పరిశీలన

**హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదులను తెలుసుకోవాలి : కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, నవంబర్ 29 : మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్, కమిటీ కంట్రోల్ రూంను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం పరిశీలించారు. ఓటరు హెల్ప్‌లైన్ యాప్ 1950, సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌ను గుర్తించి తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీఎం అధికారులు సతీశ్‌కుమార్, సింహారావు, సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## రూ.56 లక్షల 84 వేలు సీజ్

కామారెడ్డి, నవంబర్ 29 : జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్ సమీపంలో పంచుతున్న డబ్బులు రూ.56 లక్షల 84 వేలు సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్ ఎదురుగా ఉన్న ఓ టైర్ షాప్ వద్ద డబ్బులు పంచుతున్నారని అందిన సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఆ షాపు బయట కాంగ్రెస్ నాయకుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, అతని అనుచరులు కొందరు ఉన్నారు. గూడెం శ్రీనివాస్‌రెడ్డి దగ్గర ఒక బ్యాగ్ కనబడగా ఎఫ్ఎస్‌టీ సభ్యులు ఆ బ్యాగును తనిఖీ చేశారు. అందులో 500 రూపాయల నోట్ల కట్టలు ఉన్నాయి. వెంటనే ఎఫ్ఎస్‌టీ సభ్యులు ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్లకు తెలియజేశారు. ఇన్‌కమ్ టాక్స్ అధికారి అభిషేక్ శుక్లా అక్కడికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించగా అందులో ఉన్న 500 నోట్ల కట్టలు మొత్తం లెక్కించి చూడగా అవి రూ.58 లక్షల 84 వేలు ఉన్నాయి. ఆ డబ్బులను సీజ్ చేసి తగు చర్య నిమిత్తం బుధవారం కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గూడెం శ్రీనివాస్‌రెడ్డి, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్ స్టేషన్ల నుంచి తరలిన ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బంది
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

దోమకొండ/బీబీపేట్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ బుధవారం సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు సర్వం సన్నద్ధమైంది. ఆయా పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలింపు ప్రారంభమైంది. పోలింగ్ స్టేషన్లలో విధుల్లో చేరడానికి పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితోపాటు సంబంధిత పోలింగ్ స్టేషన్లను చేరుకున్నారు. దోమకొండ మండలంలోని మొత్తం 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీసులు కాపాలా ఉన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని 11 పోలింగ్ కేంద్రాలు, ముత్యంపేట్‌లో మూడు, చింతమాన్‌పల్లిలో రెండు, అంబారీపేట్‌లో మూడు, గొట్టిముక్కలలో ఒక్కటి, అంచనూర్‌లో రెండు, సంఘమేశ్వర్ రెండు, సీతారాంపల్లిలో ఒక్కటి, లింగుపల్లిలో ఒక్కటి మొత్తం 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**బీబీపేట్ మండలంలో 25..**

బీబీపేట్ మండలంలోని మొత్తం 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. బీబీపేట్‌లో ఏడు, మాందాపూర్‌లో మూడు, జనగామలో రెండు, ఇస్సానగర్‌లో రెండు, ఉప్పర్‌పల్లిలో రెండు, శేరీ బీబీపేటలో ఒక్కటి, తుజాల్‌పూర్‌లో రెండు, మల్కాపూర్‌లో రెండు, యాడారంలో రెండు, శివారు రాంరెడ్డిపల్లిలో ఒక్కటి, కోనాపూర్‌లో ఒక్కటి మొత్తం 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.బీబీపేట్ మండలంలో అన్ని గ్రామాల్లో పురుషులు 9,860, స్త్రీలు 10,509 మొత్తం 20,370 మంది ఓటు హక్కును కలిగిఉన్నారు.

**భిక్కనూరు మండలంలో 44..**

భిక్కనూరు, నవంబర్ 29 : భిక్కనూరు మండలంలోని 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్ తెలిపారు. మండలంలోని 38,438 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో 19,822 మంది మహిళా ఓటర్లు, 18,566 మంది పురుషులు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు, 57 మంది సర్వీస్ ఓటర్లు మొత్తంలం కలిపి 38,438 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఓటు ఉన్నావారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు.




దోమకొండలోని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం



దోమకొండలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం



భిక్కనూరులోని బాలుర పాఠశాలలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు